క్లుప్తంగా

సారా కేసులో ఒకరి అరెస్టు



సారా అమ్ముతున్న వ్యక్తితో పోలీసులు

కురబలకోట : మండలంలోని ఎర్రమద్దివారి పల్లె కాలనీ వద్ద నాటు సారా విక్రయిస్తున్న గుండ్లూరి బాబుల్ (69)ను గురువారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. 15 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎఎస్‌ఐ గజేంద్ర, బి. రవీంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్టాపన



ఆంజనేయస్వామి ఆలయం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అంకిరెడ్డిపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్టాపన భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త బోర్‌వెల్ నారాయణరెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు. అధిక సంఖ్యలో వచ్చే వారి కోసం అన్నదానం ఏర్పాటుచేశామన్నారు.

మంచిని పెంచడానికే యజ్ఞం



పాండవ జననం కథను తెలియజేస్తున్న హరిదాసు కౌసల్య

కలకడ : ప్రతి ఒక్కరిలో మంచిని పెంచి, చెడు నుంచి జరిగే నష్టాలను తెలుపడానికి మహాభారతం అవసరమని హరిదాసు కౌసల్య పేర్కొన్నారు. మండలంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త రామయ్య ఆధ్వర్యంలో మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం పాండవ జననం హరికథతో కార్యక్రమాలు ప్రారంభించారు. ముందుగా ద్రౌపది, పాండవులకు పూజలు చేశారు. అనంతరం కౌసల్య మాట్లాడుతూ ధర్మం విజయం సాధిస్తుందని, అధర్మం ఎన్నటికీ రాజ్యమేలదన్నారు. 18 రోజులు పాటు జరిగే యజ్ఞంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఓటే వజ్రాయుధం



బస్సుకు అతికించిన పోస్టర్

మదనపల్లె సిటీ : ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రచారం చేపట్టింది. ఇందులో భాగంగా మదనపల్లెలోని ప్రధాన కూడళ్లు, ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రాంతాల్లో పోస్టర్ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. 2024 లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు వేద్దాం.. ఓటింగ్‌లో పాల్గొందాం... అంటూ ఈ ప్రచారం సాగుతోంది.

ఘనంగా కవితా దినోత్సవం



కవితలు వినిపిస్తున్న యుగంధరాచారి

మదనపల్లె సిటీ : స్థానిక బెంగుళూరు రోడ్డులోని మరసం కార్యాలయంలో గురువారం సాయంత్రం ప్రపంచ కవితా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కవులు రామిశెట్టి వెంకటేశ్వరరావు, రామమోహన్‌నాయుడు, యుగంధరాచారి, కరుణాకర్‌లు తమ కవితలు వినిపించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై లోకేష్

నిమ్మనపల్లె : మండలంలోని పోలింగ్ కేంద్రాలను సెక్టార్ అధికారి ఎం.ఆర్.పద్మావతి, ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి గురువారం పరిశీలించారు. మండలంలోని నిమ్మనపల్లి, తవళం, కొండయ్యగారిపల్లి పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బూత్ స్థాయి అధికారులకు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై సూచనలు చేశారు. పటిష్ట బందోబస్తు మధ్య ఎన్నికలు నిర్వహించడానికి తగు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నియమావళిని పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ జిలానీ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్



ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులకు సూచనలిస్తున్న ఆర్వో హరిప్రసాద్

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల తరఫున బరిలో ఉన్న అభ్యర్థులు సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రచారానికి ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ హరిప్రసాద్ తెలిపారు. స్థానిక సబ్ కలెక్టరేట్‌లో మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నోడల్ అధికారులతో గురువారం సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆర్వో హరిప్రసాద్ మాట్లాడుతూ...వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రచారం కోసం 24 గంటల ముందుగా ఎన్నికల అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత వీడియో, ఫోటోను వాట్సాప్ లేదా మెసేజ్ ద్వారా సంబంధిత అధికారులకు తెలపాలన్నారు. ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో నియోజకవర్గంలోని ప్రింటింగ్ ప్రెస్, ముద్రణ సంస్థలు కరపత్రాలు, పోస్టర్లు ఇతర మెటీరియల్ ప్రింటింగ్‌లో నిబంధనలు పాటించాలన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని 1ద్యి ప్రకారం కరపత్రాలు, పోస్టర్లు ముద్రించేటపుడు సంబంధిత పత్రాలపై ప్రింటర్, పబ్లిషర్ పేర్లు, చిరునామా ఉండాలని పేర్కొన్నారు. వాటిని ముద్రించిన మూడు రోజుల్లోపు కాపీలను ఎన్నికల అధికారి కార్యాలయానికి అందజేయాలన్నారు. అలాగే కల్యాణ మండపాల్లో పెళ్లిళ్లు, శుభకార్యాలు కాకుండా ఇతర కార్యకలాపాలు జరిగితే నిఘా ఉంచాలన్నారు. నియోజకవర్గంలోని ఫారెస్ట్, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్, ఎక్సైజ్ చెక్‌పోస్ట్ వివరాలతోపాటు, అన్నింటిలో వెబ్ క్యాస్టింగ్ సదుపాయం ఉండేలా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ల్లో తనిఖీలు ముమ్మరంచేసి, ఎన్నికల నిబంధన అతిక్రమణ జరగకుండా చూడాలని పోలీస్‌శాఖకు సూచించారు. అలాగే మండలస్థాయిలో ఎంసీసీ అమలుకు సంబంధించి రాజకీయపార్టీల ప్రతినిధులు, ఏజెంట్లకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసాదరెడ్డి, సబ్ డీఎఫ్‌ఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, తహసీల్దారు రమాదేవి, ఎంపీఏ శివలింగయ్య, ఎంపీడీఓ భానుప్రసాద్, సీఐలు వలీబాషు, యువరాజు, ఎన్.శేఖర్, శివయ్య, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించేందుకే బీజేపీతో పొత్తు

రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్



మహిళకు కరపత్రం అందజేస్తున్న డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, తదితరులు

కలికిరి : ప్రజాబలం కలిగిన సీఎం జగన్‌మోహన్ రెడ్డిని నేరుగా ఎదుర్కోలేక జనసేన, బీజేపీలతో పొత్తుపెట్టుకుని ప్రజలను మోసగించడానికి చంద్రబాబు సిద్ధమయ్యారని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. కలికిరి పట్టణంలోని కె.రెడ్డివారిపల్లి, పాతసంతగేటు వీధి, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధి, నూరానీ మసీదు ఏరియా తదితర ప్రాంతాల్లో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలలో ఇచ్చిన హామీలలో 99శాతం అమలు చేసిన జగన్ మోహన్ రెడ్డి ప్రజలలో మన్ననలు పొందారని, తిరిగి ప్రజా సంక్షేమ పాలన రావాలంటే ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. రాష్ట్రంలో ముస్లింల రిజర్వేషన్లు, హక్కులను బీజేపీకి తాకట్టుపెట్టిన టీడీపీ, జనసేన కూటమికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాని పిలుపునిచ్చారు. నిత్యం ప్రజలలో ఉండే పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, అభివృద్ధి అంటే ఎంటో చేసి చూపిన రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ప్రజలు మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆఘామొహిద్దీన్, మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడి హరి, సర్పంచులు వెంకటరెడ్డి, గంగయ్య, తస్లీమారియాజ్, రత్నశేఖర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, ఎంఐ హనీఫ్, రిజ్వానుల్లా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కమ్మచెరువు పంచాయతీలోని గారచెట్లపల్లిలో నీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డికి విన్నవించారు. ఎంపీడీవోను గురువారం గ్రామస్థులు కలిసి సమస్య విన్నవించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ బోరుకు ట్రాన్స్‌ఫార్మర్ ఫీజును ఓ రైతు తొలగించడంతో సమస్య తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై స్పందించిన ఎంపీడీవో, ట్రాన్స్‌కో ఏఈ ఉత్తన్న, సర్పంచ్ చెరువు నరసమ్మలను ఆరా తీశారు. 2021లోనే సదరు ట్రాన్స్‌ఫార్మర్ ప్రభుత్వానికి సంబంధించినది కావడంతో రూ.50 వేల విద్యుత్ బిల్లులు కూడా చెల్లించినట్లు సర్పంచి తెలిపారు. రైతుతో మాట్లాడి ప్రజలకు తాగునీరు సరఫరా అయ్యేలా ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి సమస్యను పరిష్కరించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

కేవీపల్లె : మండలంలోని తువ్వపల్లె పంచాయతీకి చెందిన మాజీ సర్పంచి చిరసాని వెంకట రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ జి.నరసింహులు, తదితరులు గురువారం టీడీపీని వదలి వైఎస్సార్‌సీపీలో చేరారు. వాల్మీకిపురంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచి వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలకు ఎంతో ఆకర్షణీయులయ్యామన్నారు. తాము వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, సర్పంచ్ ఆనంద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్‌రెడ్డి, నాయకులు గౌరీశంకర్‌రెడ్డి, జయరామ్, తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై గట్టు వెంకటరమణస్వామి



సింహవాహనంపై గట్టు వెంకటరమణస్వామి

రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరులో జరిగే గట్టు వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి స్వామి సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు , పంచామృతాభిషేకాలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మేళతాళాలు, చక్క భజనల, కోలాటం మధ్య భక్తులు గ్రామ వీధుల్లో స్వామిని ఘనంగా ఊరేగించారు. అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ముందస్తు అవగాహనతోనే జ్వరాల నియంత్రణ



జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

కేవీపల్లె : ముందస్తు అవగాహనతోనే జ్వరాల నియంత్రణ సాధ్యమని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని గర్నిమిట్ట, జిల్లేళ్లమంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి దస్త్రాలు పరిశీలించారు. గుండ్రేవారిపల్లెలో ఇంటింటా తిరిగి జ్వరాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దోమకాటుతో మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు తదితర జ్వరాలు వ్యాప్తి చెందుతాయని అన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, నీటి డ్రమ్ములు, తొట్టెలు కనీసం వారానికి ఒకసారైనా శుభ్రం చేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే జ్వరాలు నియంత్రించగలమని, ప్రతి శుక్రవారం - డ్రైడే కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ, డాక్టర్ సాయి శిరీష, సీహెచ్‌వో భాగ్యలక్ష్మీ, ముజీబ్, పర్యవేక్షకులు రమాదేవి, రుక్మిణి, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

నోటి శుభ్రతతో ఆరోగ్యానికి భద్రత



అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది, విద్యార్థులు

పీలేరు : నోటి శుభ్రతతో ఆరోగ్యానికి భద్రత కలుగుతుందని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. తలుపుల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటి శుభ్రతపై గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు రాకుండా నోటి శుభ్రతపై చిన్న వయస్సు నుంచే పిల్లలకు అవగాహన అవసరమన్నారు. రోజుకు రెండు సార్లు దంత ధవనం చేయాలని, రెండు నెలలకోకసారి బ్రష్ మార్చాలని సూచించారు. దంతాలు శుభ్రం చేయకపోతే దంతక్షయ, చిగుళ్ల వాపు సమస్యలే గాక, కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ముందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి విధిగా పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి

పీలేరురూరల్ : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది విధిగా పాటించాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల విధులు- ఆచరణ అంశంపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులకు 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



సిలిండర్ నుంచి వస్తున్న మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాయచోటి టౌన్ : వేసవిలో సంభవించే అగ్నిప్రమాదాల నుంచి మన స్థిర, చరాస్తులను ఎలా కాపాడుకోవాలనే విషయాలపై విద్యార్థులకు రాయచోటి ఫైర్ స్టేషన్ అధికారి వెంకట్రామిరెడ్డి వివరించారు. గురువారం రాయచోటి పట్టణంలోని నారాయణ స్కూల్‌లో వేసవిలో సంభవించే అగ్నిప్రమాదాలు, ఇళ్లలో గ్యాస్, ఇతరా మంటల ద్వారా జరిగే ప్రమాదాల నుంచి మనల్ని మనం కాపాడుకోవడంతో పాటు మన ఆస్తులను ఎలా కాపాడుకోవాలనే విషయాలపై విద్యార్థులకు వివరించారు. మంటలు ఎలా ఆర్పాలనే విషయాలపై సూచనలు, సలహాలు అందించారు. మొదటగా ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా ధైర్యంగా సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రమాదం నుంచి బయటపడే దారులను చూడాలని సూచించారు. అలాగే అన్నింటి కన్నా ప్రధానంగా అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఏజీఎం శంకర్‌రెడ్డి, ఏఓ నరసింహులు, అకాడమిక్ డీన్ యువరాజ్, వైస్ ప్రిన్సిపల్ సుగుణవేణి, ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఊపిరి ఉన్నంతవరకు వైఎస్సార్‌సీపీతోనే

సర్పంచ్ చిప్పిలిచలపతి, బండిమనోహర్



ఎంపీ మిథున్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సర్పంచ్ చిప్పిలిచలపతి, తదితరులు

మదనపల్లె : వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి విధేయులుగా ఉంటున్నామని, ఊపిరి ఉన్నంతవరకు ఇదే పార్టీలో కొనసాగుతామని కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి, వైఎస్సార్ సీపీ నాయకులు బండిమనోహర్ తెలిపారు. మదనపల్లెకు వచ్చిన ఎంపీ మిథున్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా గురువారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా చిప్పిలి చలపతి మాట్లాడుతూ..టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషాను తాము ఆహ్వానించకున్నా... ఆయనే చొరవ తీసుకుని, ఇంటికి వచ్చి శాలువా కప్పి ఫోటోలు తీయించుకుని వెళ్లాడన్నారు. తాము అతడికి మద్దతు తెలిపినట్లుగా జరిగిన ప్రచారంలో వాస్తవం లేదన్నారు. బండిమనోహర్ మాట్లాడుతూ... తన జన్మదినం సందర్భంగా పార్టీలకతీతంగా పలువురు తనను అభినందించేందుకు వచ్చారని, అందులో భాగంగానే టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా శుభాకాంక్షలు తెలిపి వెళ్లారన్నారు. ఆయనకు ఎన్నికల్లో సహకరిస్తానని, మద్దతు తెలిపినట్లు వచ్చిన వార్తలు అవాస్తవాలన్నారు. తమకు రాజకీయ భవిష్యత్ కల్పించి, సమాజంలో హోదా, గౌరవప్రతిష్టలు కల్పించిన వైఎస్సార్‌సీపీని తాము ఎప్పటికీ వీడేదిలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నిసార్ అహ్మద్ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషిచేసి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుంటామన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు, అధికారులు

కలికిరి : ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జేఎన్టీయూ ప్రిన్సిపల్ వెంకటేశ్వరావు పేర్కొన్నారు. మండలంలో పలు గ్రామాల్లో జేఎన్టీయూ విద్యార్థులు ర్యాలీ ద్వారా ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఓటు ఆయుధం లాంటిదని, మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ అపర్ణ, తహశీల్దారు విజయకుమారి, అధ్యాపకులు రంగ జనార్ధన్, నాగప్రసాద్, కృష్ణయ్య, విశ్వనాథ్, నరేష్, వి/ష్ణాన్, శ్రీనివాసులు, వెంకటేష్, చంద్రయ్య, నరేంద్రరెడ్డి, దొరస్వామి, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం



పద్మ మృతదేహానికి అంత్యక్రియలు చేస్తున్న హెల్పింగ్ మైండ్స్ సభ్యులు

మదనపల్లె సిటీ: సంచార జీవనం సాగించే ఓ మహిళ అనారోగ్యంతో మృతి చెందడంతో అంత్యక్రియలు చేయడానికి ఎవరూ స్పందించలేదు. విషయం తెలిసిన హెల్పింగ్ మైండ్స్ సభ్యులు మానవత్వంతో మేమున్నామంటూ ముందుకు వచ్చారు. దగ్గరుండి దహన క్రియలు చేసి మానవత్వం చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. మదనపల్లె పట్టణానికి చెందిన నాగరాజు, పద్మ చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పద్మ ఇటీవల అనారోగ్యానికి గురై స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం మృతి చెందారు. అంత్యక్రియలకు బంధువులెవరూ ముందుకు రాలేదు. విషయం తెలిసిన వెంటనే హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్దిక్ నాగరాజుకు ధైర్యం చెప్పారు. అంబులెన్స్ మాట్లాడి, హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కిరణ్, ఇలియాజ్, పురుషోత్తం, సాంబ, పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మదనపల్లె సిటీ : డయల్ యువర్ డీఎం కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ-2 డిపో ఇన్‌చార్జి మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. 22న ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ప్రజలు 9959225676కు ఫోన్ చేసి ఆర్టీసీతో కలిగే ఇబ్బందులు, సమస్యలు, ఆదాయం పెంచుటకు సలహాలను తెలియజేయాలని కోరారు.

ఫైబర్‌నెట్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోవాలి

పీలేరు : ఆంధ్ర ప్రదేశ్ ఫైబర్ నెట్‌వర్క్ లిమిటెడ్‌కు సంబంధించి సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోని ఖాతాదారులకు ప్రసారాలు నిలిపివేస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా మేనేజర్ గోవిందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోవాలని మెసేజ్‌ల ద్వారా తెలిపామని, కొందరు ఖాతాదారులు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోని విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోని ఖాతాదారులకు ఎల్‌ఎంఓలు సాంకేతికంగా సహకరిస్తారన్నారు.

ఫ్రూట్ కవర్లతో నాణ్యమైన దిగుబడి

కలికిరి : ఫ్రూట్ కవర్లతో మామిడిలో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని కేవీకే శాస్త్రవేత్త డా. పీరూ సాహెబ్ అన్నారు. మామిడిలో ఫ్రూట్ కవర్లు, పండు ఈగ బుట్టల ప్రాముఖ్యతపై రైతులకు కేవీకేలో గురువారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి కాయలు కోడిగుడ్డు సైజులో ఉన్నప్పుడే ఫ్రూట్ కవర్లు అమర్చితే పండు ఈగ, మసి మంగు తెగులు, కాయతొలచు పురుగు, ఇతర కీటకాల బారి నుండి కాపాడుకోవచ్చని తెలిపారు. ఫ్రూట్ కవర్లతో వచ్చిన మామిడి కాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో అధిక లాభాలు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.